క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అవగాహన సేవలు

లక్ష్మీపురం: అవగాహన సంస్థ గత 15 రోజుల నుంచి విస్తృత స్థాయిలో పట్టభద్రుల ఓటర్ల నమోదు కొనసాగించి వేలాది మందికి ఫారం –18 అందజేసిన వారు పూర్తి చేసేలా కృషి చేశారని విద్యావేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 18,400 మందికి ఓటరు నమోదు ఫారాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో గైడెన్స్ సెల్ సభ్యులు వెంకటరత్నం, ప్రసాద్, భావన్నారాయణ ప్రసంగించారు.

గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పట్నంబజారు: కార్తిక మాసం పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 15న అరుణాచలంలో నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న జరిగే గిరి ప్రదక్షిణకు సంబంధించి ఈనెల 13 రాత్రి 9.15 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతోందని, 14న కాణిపాకం, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపులు దర్శించుకుని, అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 15వ తేదీ ఉదయం గిరిప్రదక్షిణ చేసుకుని, అరుణాచలం దర్శనం అనంతరం సాయంత్రం బయల్దేరి 16వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేయాలనుకునే వారు 96164 సర్వీసు నంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. టికెట్టు ధర రూ. 2,420 తెలిపారు. మరిన్ని వివరాలకు 7382897459, 7382896403 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నేతలే టార్గెట్‌గా దుకాణాల తొలగింపు




నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వైఎస్సార్ సీపీ నేతలే టార్గెట్‌గా చేసుకుంటూ కూటమి నేతలు అధికారులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్ సీపీ నేతలకు చెందిన దుకాణాలు తొలగిస్తున్న ఘటన గుజ్జనగుండ్ల సెంటర్‌లో చోటు చేసుకుంది. డీ మార్ట్‌ను అనుకుని రోడ్డుకు ఎటువంటి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వైఎస్సార్‌సీపీ 38వ డివిజన్ ప్రెసిడెంట్ బోగిసం ప్రసాద్ చిన్న వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే ఈ మధ్య కాలంలో డ్రెయిన్ల మీద ఆక్రమణల పేరుతో నగరపాలక సంస్థ అధికారులు కేవలం వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యాపారాల్సి టార్గెట్ చేసుకుంటూ వారి దుకాణాలను ధ్వంసం చేస్తున్నారు. ఇదే సెంటర్‌లో మరికొన్ని దుకాణాలను నగరపాలక సంస్థ సిబ్బంది తొలగించకుండా కేవలం వైఎస్సార్ సీపీకి చెందిన దుకాణాలనే తొలగించడంపై పలువురు కార్పొరేషన్ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన 'చంచల' సాంఘిక నాటకం



నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సాయంత్రం చంచల సాంఘిక నాటకం ప్రదర్శించారు. జస్ట్ స్మైల్ (తిరుపతి), నీలం మందారరావు ఆధ్వర్యంలో లక్ష్మీ కులశేఖర్ రచించి డాక్టర్ రవీంద్ర దర్శకత్వం వహించారు. నాటకం సందేశాత్మకంగా సాగింది. కార్యక్రమంలో మూర్తి, నాయుడు గోపి, శివప్రసాద్, నాగభూషణం, రాయపాటి ఆశీర్వాదం, ఐ.నరసింహం, ఆర్.ప్రసాద్, కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి యు.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అవతరణకోసం విశేష పోరాట ఉద్యమం చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులను సత్కరించారు.

18న ఇళ్ల స్థలాల కోసం ధర్నా



లక్ష్మీపురం: పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు స్థలం ఇస్తామంటూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాన్ని చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. కొత్తపేట మల్లయ్య లింగంభవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విధిస్తున్న చార్జీలు భారాలు కాదా అని ప్రశ్నించారు. అన్ని రకాలుగా సుమారు రూ.18 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపబోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, వలి, యశ్వంత్ రెంటాల కుమారి పాల్గొన్నారు.

కూటమి జేబుల్లో మార్కెట్ ఆశీలు

- కార్పొరేషన్ సిబ్బంది పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న నేతలు
- రోజూ రూ.వేలల్లో జీఎంసీకి ఆదాయానికి గండి
- పక్కాగా సిబ్బందే వసూలు చేయాలని ఇటీవల కమిషనర్ ఆదేశాలు
- అయినా కొన్ని చోట్ల సిబ్బందిపై బెదిరింపులకు దిగుతున్న నేతలు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్ల నుంచి ఆశీలు వసూలు నగరపాలక సంస్థ సిబ్బంది చేయాల్సి ఉంది. కాని ఇక్కడ ఎక్కడా కూడా నగరపాలక సంస్థ సిబ్బంది వసూలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. కార్పొరేషన్ సిబ్బంది పేరుతో కూటమి నేతలు, కూటమికి చెందిన కార్పొరేటర్లు రోజుకు వేలల్లో మార్కెట్ల నుంచి ఆశీలు రూపంలో చేసుకుని తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

నగర పరిధిలోని మార్కెట్లు, దొడ్లు, సైకిల్ స్టాండ్లు ఇవే...

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కొల్లి శారద హోల్ సెల్ కూరగాయల మార్కెట్, పీపీకే నాయుడు మార్కెట్, పాల ఆస్పత్రి వద్ద కూరగాయల మార్కెట్, అరండల్ పేట 1వ లైన్‌లోని పచ్చ గడ్డి మార్కెట్, సంబ్రీస్ మార్కెట్‌లో వ్యాపారుల నుంచి, పీపీకే నాయుడు మార్కెట్ ఉత్తర, దక్షిణం వైపు ఫెన్సింగ్‌లో, వెస్ లాక్ మార్కెట్‌లో సైకిల్ స్టాండ్లు, కొల్లి శారద హోల్ సెల్ కూరగాయల మార్కెట్ వద్ద, ఎన్టీఆర్ బస్టాండ్, కృష్ణా పిక్చర్ ప్యాలెస్ సెంటర్, బండ్ల బజార్ వద్ద, గాంధీ పార్క్ వద్ద, విజ్ఞాన మందిరం రోడ్ లోని, తహసీల్దార్(వెస్ట్) కార్యాలయం వద్ద, పాల ఆస్పత్రి వద్ద, నాజ్ సెంటర్ వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ రుసుంలను నగరపాలక సంస్థ సిబ్బందే వసూలు చేయాల్సి ఉంది... కాని నగరపాలక సంస్థ సిబ్బంది ఉత్సవం విగ్రహం లాగా నిలబడితే కూటమి నేతలు అక్కడికి చేరుకుని వ్యాపారస్తుల నుంచి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి నేతల జేబుల్లో..

పైన తెలిపిన మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, మరుగుదొడ్ల నుంచి రోజుకు వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు అవుతుంటాయి. కాని నగరపాలక సంస్థకు జమ అయ్యేది వేళ్ల మీద లెక్కేసుకుని చెప్పొచ్చు. అది కూడా ఇటీవల 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితం కావడంతో ఆ కొద్దిగా అయిన కార్పొరేషన్‌కు నగదు జమఅవుతుంది. అది కూడా లేకపోతే... కార్పొరేషన్ ఆదాయం గండి పడినట్లే... ప్రస్తుతం ఈ కూటమి నేతల దందాను కూడా గట్టిగా అరికట్టగలిగితే కార్పొరేషన్‌కు మరింత ఆదాయం పెరుగుతుందని పలువురు రెవిన్యూ అధికారులే చెప్పడం గమనర్హం.

సిబ్బందిపై పరోక్షంగా బెదిరింపులు..

నగర పాలక సంస్థ పరిధిలోని మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్స్ వద్ద నుంచి రుసుం నగరపాలక సంస్థ సిబ్బందే వసూలు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కొద్ది రోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగర పాలక సంస్థ సిబ్బంది కాకుండా ఇంకా ఎవరైన దళారులు వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా తనకే ఫిర్యాదు చేయాలని కమిషనర్(9440268888) సూచించారు. అయితే క్షేత్ర స్థాయిలో కూటమి నేతలు కార్పొరేషన్ స్బిబందిపై పరోక్షంగా బెదిరింపులకు దిగుతూ వారిని ముందుకు నిల్చుబెట్టి తమ వారితో కూటమి నేతలు డబ్బులు వసూలు చేయించి వారికి కావాల్సింది తీసుకుని... మిగిలిన చిల్లర నగరపాలక సంస్థ సిబ్బందికి అందజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.(ఉదహారణకు బస్టాండ్ వద్ద ఉన్న కొల్లి శారదా మార్కెట్‌లో రోజుకు రూ.14వేల దాకా వసూలు కావాల్సి ఉండగా కేవలం అక్కడ 5 నుంచి 6 వేలు మాత్రమే నగరపాలక సంస్థ కార్పొరేషన్ సిబ్బంది కార్పొరేషన్‌కు జమ చేస్తున్నారంటే విషయం అర్థం చేసుకోవచ్చు).

నీటి చార్జీల బకాయిలు వెంటనే చెల్లించాలి



రెవెన్యూ అధికారులతో సమావేశమైన కమిషనర్

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నీటి మీటర్ల బకాయిలు చెల్లించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో నీటి మీటర్ల చార్జీలు, ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్ను వసూలుపై ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. తొలుత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా నీటి మీటర్ల బకాయిలపై సమీక్షించి, రూ.లక్షల్లో బకాయిలు ఉండటం గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాల ద్వారా మూడు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. బకాయిలు ఉన్న గృహ యాజమానులు 60 రోజుల్లో చెల్లించాలని, లేనిచో కుళాయి తొలగించడం జరుగుతుందని చెప్పారు. అనధికార కుళాయిలను గుర్తించామని, వాటిని వెంటనే తొలగించడానికి ఏఈల వారీగా చర్యలు తీసుకుంటామని వివరించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు ఉచిత కుళాయిల కోసం స్థానిక వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బకాయి ఉన్న ఆస్తి, ఖాళీ స్థల పన్నులను నగరపాలక సంస్థ కార్యాలయ క్యాష్ కౌంటర్లలో చెల్లించి రశీదులు పొందాలన్నారు. మీటర్ రీడర్లు ప్రతి రోజు 50 మీటర్ల రీడింగ్ తీసి, ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసి రోజువారీ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా ప్రతి అసెస్మెంట్‌ని తనిఖీ చేసి, అండర్, అన్ అసెస్మెంట్లను గుర్తించి, తదుపరి సమావేశం నాటికి డిమాండ్‌లో పురోగతి ఉండాలన్నారు. రెవెన్యూ వసూలులో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి నగదు పురస్కారాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రెహమాన్, రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించి ఇళ్లు తొలగించాలి



కేంద్ర మంత్రి పెమ్మసానికి సమస్య విన్నవిస్తున్న యానాది కాలనీకి చెందిన స్థానికులు, నాయకులు

నెహ్రూనగర్: గుంటూరు కాకుమానువారితోట(కార్మికశాఖకు చెందిన స్థలంలో) యానాది కాలనీలో యానాదులు 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని అటువంటి వారిని అర్ధాంతరంగా నగరపాలక సంస్థ సిబ్బంది ఇళ్లు తొలగిస్తామని వారిని భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని పలువురు ప్రజా సంఘాల నాయకులు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తు కాగితాలు ఎరుకుంటూ వచ్చిన ఆదాయంతో బతుకుతున్న వారి ఇళ్లను తొలగించడం ద్వారా వారు ఎక్కడికి వెళ్లలేని పరిస్థితిగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా స్థలం కాని, టిడ్కో ఇళ్ల మంజూరు చేసి వారికి పునరావాసం కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, తాడికొండ నరసింహరావు, విప్పర్ల ముత్తయ్య, యానాది కాలనీ వాసులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ కార్తిక వన సమారాధన



గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తిక వన సమారాధన ఈనెల 10న హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు రంగావర్జుల లక్ష్మీపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా బ్రాహ్మణ కార్తిక సమారాధన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కార్తిక దామోదర పూజా కార్యక్రమాలతో ప్రారంభమై పిల్లలకు, మహిళలు, పురుషులకు పలు రకాల ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి బ్రాహ్మణ సమారాధన ఉంటుందన్నారు. బ్రాహ్మణ బంధువులందరూ సమారాధనకు అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కారిక వనసమారాధన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గొల్లపూడి రామకృష్ణారావు, కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ నందిరాజు పాండు రంగారావు, కార్యవర్గ సభ్యులు జీవీఎల్ఎన్ సంజీవరావు, మతుకుమల్లి కోదండ రామారావు, పి.మురళీమోహన్, కే.పాంచజన్య శర్మ, ఎం.వెంకటకృష్ణ, పి.శ్రీనాథ్, బి.ప్రసాద్, అవ్వారి మంగాదేవి పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి

ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి



వెంకటేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: ప్రస్తుతం ఎంతో కీలకంగా మారిన సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజర్, సెక్యూరిటీ కన్సల్టెంట్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సైబర్ సెక్యూరిటీపై సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ సైబర్ దాడులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ప్రపంచం మొత్తం సైబర్ సెక్యూరిటీ అంశాలపై చాలా ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. విద్యార్థులు వ్యక్తం చేసిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం ఉపకులపతి ఆచార్య కే గంగాధర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస వెంకటేశ్వర రెడ్డిని వీసీ సత్కరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, సైబర్ సెక్యూరిటీ విభాగధిపతులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు



కొరిటెపాడు: ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ మూర్తి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ పరిధిలో గుంటూరు సూపరింటెండెంట్ ఇంజినీరు ఆధ్వర్యంలో నల్లచెరువులోని సమావేశ మందిరంలో వర్క్స్ రివ్యూ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఉద్యోగ విధులు నిర్వర్తించాలన్నారు. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా విద్యుత్ శాఖ పరికరాలు, మీటర్స్ ఎప్పటికప్పుడు మార్చి కొత్తవి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరైనా వినియోగదారుడు సర్వీసు కొరకు దరఖాస్తు చేస్తే వెంటనే నియమ నిబంధనలను అనుసరించి వారికి విద్యుత్ సర్వీసు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు తగిన సమయంలో అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పాశం రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చిరంజీవి, శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సుధీర్‌బాబు



మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: వేతన సవరణ సంఘ ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొన్న దృష్ట్యా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని అఖిల భారత సెకండరీ టీచర్స్ అసోసియేషన్(ఏఐఎస్టీఎఫ్) ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం సంఘ ప్రాంతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, కమిటీ నివేదిక వచ్చేవరకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలు సైతం ఉద్యోగులకు డీఏలు ప్రకటించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఏల ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, నిత్యావసర ధరల పెరుగుదల దృష్ట్యా తక్షణమే కరవు భత్యాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.26 వేల కోట్ల మేరకు పేరుకుపోయిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బకాయిలను క్లియర్ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ యాప్‌ల భారం లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం తగ్గించకపోగా అపార్ ఐడీలు అంటూ ఇతరత్రా పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసి మానసిక ఒత్తిడి కలుగజేస్తోందని ఆరోపించారు. యాప్‌ల భారాన్ని తొలగించడంతో పాటు అపార్ ఐడీల జనరేషన్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించి, ప్రతి గ్రామంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి, రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తూ, ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. 117 జీవోను రద్దు చేస్తామని చెప్పిన ఎన్నికల హామీ మేరకు వెంటనే ఆ జీఓను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. 2022 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాస్‌మెంట్, 2024 మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, క్లోజర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిమళ్ల ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్లు డీఏజోసెఫ్, షేక్ బాజీ, సుబ్బారావు, గుంటూరు నగరపాలక సంస్థ, తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు పాల్గొన్నారు.

ఘనంగా రేడియోగ్రఫీ దినోత్సవం



వేడుకల్లో డాక్టర్ విజేత, డాక్టర్ అంకమ్మరావు, సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రేడియాలజీ విభాగంలో శుక్రవారం ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రేడియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ విజేత ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ విజేత మాట్లాడుతూ రేడియాలజీ రంగంలో ఆధునిక సాంకేతికతతో కూడిన పరీక్షలు రోగ నిర్ధారణను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. యంత్రాంగంతో విభాగం అన్ని విధాలా పర్యవేక్షణ, రోగ నిర్ధారణలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. రోగులను నమ్మకంతో ఆస్పత్రికి వచ్చేలా ప్రోత్సహించడం, అత్యుత్తమ వైద్య సేవలను అందించడం మన కర్తవ్యం అన్నారు. కేవలం రోగ నిర్ధారణ మాత్రమే కాకుండా, రోగ నివారణలో కూడా రేడియాలజీ విభాగం ఎంతగానో సహాయపడుతోందని వివరించారు. ముఖ్యంగా వైద్య విద్యార్థులు పరిశోధనలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంకమ్మరావు మాట్లాడుతూ రేడియాలజీ విభాగంలో అత్యాధునిక పరికరాలతో రోగులకు మరింత వేగవంతమైన సేవలు అందించడం జరుగుతోందని చెప్పారు. సిబ్బందిని తాజా మార్గదర్శకాలతో అప్‌డేట్ చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రమాకాంత్, డాక్టర్ జానీ, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ మానస, డాక్టర్ ప్రశాంతి, పీజీ విద్యార్థులు, రేడియోగ్రాఫర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రేడియాలజీ విభాగానికి సంబంధించిన తాజా సాంకేతిక పరిజ్ఞానం, రోగ నిర్ధారణ, నివారణ అంశాలపై పీజీ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు(గుంటూరు): 33కేవీ ఆర్టీసీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. యాదవ బజార్, ప్రగతినగర్, పియాంక గార్డెన్స్, వినోబా నగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తూర్పు పరిధిలో..

విద్యుత్ సబ్ డివిజన్ టి–3 పరిధిలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టి–3 డీఈ బి.రాజమోహన్, డి–2 ఏఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. నల్లచెరువు, లాలుపురం, ఆర్ అగ్రహారం, ఏటుకూరు రోడ్, ఏటుకూరు గ్రామం, బైపాస్, బొంతపాడు, సంగడిగుంట ఏరియా, ఎత్తురోడ్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మార్కెట్ ఏరియా, డి.ఎస్.నగర్, మూడు బొమ్మల సెంటర్, అంకిరెడ్డిపాలెం, వెంగళాయపాలెం, నేషనల్ హైవే రోడ్ తదితర ప్రాంతాలలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామిరెడ్డితోట, రైలుపేట, గణేశ్వరరావుపేట, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, పొత్తూరువారితోట, గుంటూరువారితోట, అరండల్‌పేట, బ్రాడీపేట, కొరిటెపాడు, బుడంపాడు, ఐపీడీకాలనీ, లాంచస్టర్‌రోడ్డు, బారాఇమామ్‌పంజా, లాలాపేట, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్–1 డీఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ శుక్రవారం తెలిపారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనితాదేవి, కేవీ బ్రహ్మం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలిలోని జేఎంజే కళాశాలలో ఇటీవల నిర్వహించిన అండర్–19 వాలీబాల్, ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికల్లో ప్రతిభ చూపిన టీజేపీఎస్ కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. శుక్రవారం పట్టాభిపురంలోని కళాశాలలో నిర్వహించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడారంగంలో రాణించడం ద్వారా విద్యార్థులు సమగ్ర వ్యక్తిత్వంతో ఎదుగుతారని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ క్రీడలపై మక్కువ పెంచుకోవడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా వాలీబాల్ జట్టుకు ఎంపికైన కె.రాకేష్, ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన విల్‌స్మిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, పీడీ ఆర్.శివాజీ పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

పట్నంబజారు: ప్రతి డ్రైవర్ నిబంధనలు పాటించాలని రవాణా శాఖ ప్రాంతీయ అధికారి బి.సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. స్వర్ణభారతీనగర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆటో, కార్లు, గూడ్స్ గ్యారేజీ, మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లతో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ మద్యం తాగడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత పాటిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోపాల్, మల్లేశ్వరి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ వాహనం ఢీకొని మహిళకు గాయాలు

పట్నంబజారు: కార్పొరేషన్‌కు చెందిన వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు అయిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. శుక్రవారం మధ్యాహ్నం యువకుడితో కలసి మహిళ ద్విచక్రవాహనంపై వెళుతున్న సమయంలో కార్పొరేషన్‌కు చెందిన చెత్త సేకరించే వాహనం బైక్‌ని ఢీకొంది. ప్రమాదంలో మహిళ కిందపడిపోవడంతో ఆమె చెయ్యి నుజ్జు నుజ్జు అయింది. వెంటనే క్షతగాత్రురాలిని జీజీహెచ్‌కు వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం తమకు అందలేదని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌లో పెట్ సీటీస్కాన్ కొనుగోలుకు అనుమతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీస్కాన్ మిషన్ కొనుగోలుకు అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యూఢిల్లీకి చెందిన బ్రాండ్ లేబరేటరీస్ లిమిటెడ్ కంపెనీ వారికి పెట్ సీటీ టెండర్లు దక్కించుకోవడంతో వారికి మిషన్ కొనుగోలు ఆర్డర్ జారీ చేశారు. క్యాన్సర్ రోగులకు త్వరితగతిన క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కోసం పెట్ సీటీస్కాన్ మిషన్ ఎంతో అవసరం. ఈ వైద్య పరికరం జీజీహెచ్‌లో లేకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా బయట స్కానింగ్ సెంటర్‌లలో చేయిస్తున్నారు. పెట్ సీటీస్కాన్ పరీక్ష చేసేందుకు రూ.25 వేల వరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల వారు ఫీజు తీసుకుంటున్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీస్కాన్ అందుబాటులోకి రావడం వల్ల పేద రోగులకు మెరుగైన వైద్యం సత్వర వైద్య సేవలు లభించే అవకాశం ఉంది. వైద్య పరికరం కొనుగోలుకు రూ.18 కోట్లు ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా విడుదల చేసింది. మూడు నెలల్లోపు వైద్య పరికరాన్ని జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకురావాలంటూ పర్చేజ్ ఆర్డర్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్, నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో కార్పొరేట్ వైద్య సేవలను పేద ప్రజలకు ఉచితంగా అందజేస్తుంది. సుమారు రూ.45 కోట్లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వీసీ నిర్మించారు. ఈనెలాఖరులోపు మరో వంద పడకలతో రూ.20 కోట్లతో క్యాన్సర్ చివరి దశలో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరో క్యాన్సర్ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు తెలిపారు.